# నవోదయం

- జ్యోశ్యుల గోపాలకృష్ణమూర్తి, గుంటూరు.

ప॥ నవోదయం శుభనవోదయం
భారతావనికే నవోదయం
నవభారతావనికే శుభోదయం ॥

చ॥ సత్యం శాంతి సమతాభావన
సామరస్యము సంఘసమైక్యత
ధార్మిక చింతన ధర్మశాస్త్రములకు
నాందిగ నిలిచే భారతావనికి - ॥నవోదయం॥

చ॥ పాడిపంటలకు పచ్చదనానికి
పల్లెసీమలు పట్టుగొమ్మలు
పరాక్రమించే వీరజవానుల
విక్రమాలతో ధీటుగ నిలిచే భారతావనికి - ॥నవోదయం ॥

చ॥ పరిశ్రమించే శ్రామికజీవులు
పంట పొలాన అన్నదాతలు
ప్రజాస్వామ్యము పరిరక్షించే
ప్రజానాయకుల పరిపాలనలో
పురోగమించే భారతావనికి - ॥నవోదయం ॥

(ఆగష్టు 15వ తేదీ స్వాతంత్ర్యదినోత్సవము సందర్భముగా ...)

## అక్కడక్కడ కన్నవీ - విన్నవీ!

### మాట - మహిమ

మాటలాడవలయు మాధుర్యములు చింద
మాటయందె సిరుల మూటకలదు
మాటయగును నవ్యమందారకుసుమమ్ము
మాటవాడి కత్తిపోటు సుమ్మ!

### మనిషి - మాధవుడు

నరుడు విశ్వవ్యాప్తి నారాయణుని అంశ
సృష్టిలయములకును జీవగఱ్ఱ
స్వార్థ రాగములను సరిచేసుకున్నచో
మనిషి - మనిషిగాదు - మాధవుండె.